సాక్షి ఏలూరు

ఆదివారం । 5 । మే । 2024



శ్రీనివాసా.. గోవిందా

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రం భక్తజన సంద్రమైంది. వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలూ కిటకిటలాడాయి.



గోసంరక్షణ పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి గోసంరక్షణ పథకానికి ఏలూరుకు చెందిన మాగంటి రాజా రామ్మోహన్‌రావు, లక్ష్మీ దంపతులు రూ. 1,01,116 లను విరాళంగా అందజేశారు.



శ్రీవారి సేవలో అబ్జర్వర్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బాల సుబ్రహ్మణ్యం, అసెంబ్లీ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ కమల్‌కాంత్ సరోచ్ సందర్శించారు.

న్యూస్‌రీల్

నేడు నీట్ పరీక్ష



ఏలూరులో పరీక్షా కేంద్రం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలోని వైద్య విద్యా కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) ఆదివారం ఏలూరులో జరుగనుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకూ పరీక్ష నిర్వహించనున్నారు. ఏలూరులో మూడు కేంద్రాలు ఏర్పాటుచేశారు. పరీక్షలకు సిటీ కో–ఆర్డినేటర్‌గా వైఎస్ఎస్ చంద్రశేఖర్ వ్యవహరించనున్నారు. ఏలూరు సీఆర్ఆర్ అటానమస్ కళాశాలలో 504 మంది విద్యార్థులను కేటాయించగా అబ్జర్వర్‌గా ఎం.కృష్ణ, సీఆర్ఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు 504 మందిని కేటాయించగా అబ్జర్వర్‌గా జి.ప్రభు, సత్రంపాడు ఆదిత్య డిగ్రీ కళాశాలకు 253 మందిని కేటాయించగా అబ్జర్వర్‌గా ఓ.శ్రీహరి వ్యవహరించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ మాత్రమే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు అడ్మిట్ కార్డు, పాస్‌పోర్టు ఫొటో, ఐడీ కార్డు వెంట తీసుకురావాలి. పారదర్శకంగా ఉంటే మంచి నీటి బాటిళ్లు మాత్రమే తీసుకురావాలి. ఫార్మల్ దుస్తులు ధరించాలి. ఎలక్ట్రానిక్ వస్తువులు, వాచ్‌లు, మొబైల్ ఫోన్లను అనుమతి లేదు.

నాయీ బ్రాహ్మణుల మద్దతు



మేమంతా సిద్ధం పోస్టర్లను అందచేస్తున్న ప్రసాద్ నంద

దెందులూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు రాష్ట్రంలోని నాయీ బ్రాహ్మణులంతా వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అరిసెపల్లి ప్రసాద్ నంద అన్నారు. శనివారం దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్‌కు మద్దతుగా ఏలూరు రూరల్, దెందులూరు, పెదవేగి, పెదపాడు మండలాల్లో నాయీ బ్రాహ్మణులను కలిశారు. గ్రామగ్రామానా నాయీ బ్రాహ్మణులను కలిసి రాష్ట్ర నాయకత్వం ఆదేశాలను వివరిస్తున్నామన్నారు. మేమంతా సిద్ధం పోస్టర్లను అందజేశారు. వచ్చేది జగనన్న ప్రభుత్వమేనని, గత ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమమే ఇందుకు కారణమని ఆయన అన్నారు.

1.70 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇప్పటివరకు 13,006 మంది రైతుల నుంచి రూ.337.07 కోట్ల విలువైన 1,70,198 టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. జిల్లాలోని 17 మండలాల్లోని 107 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 24,461 మంది రైతులు 1,88,056 టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకున్నారన్నారు. 49 లక్షల గోనె సంచులను అందుబాటులో ఉంచామని చెప్పారు. కనీస మద్దతు ధర కామన్ రకం క్వింటాల్‌కు రూ. 2,183, గ్రేడ్–ఎ రకానికి రూ.2,203 పొందవచ్చన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులుంటే జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ 08812-230448, 7702003584, 7569562076, 7569597910 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

చదువుకు ఊతం

అమ్మఒడి చల్లగా..

- అమ్మఒడి సాయం రూ.17 వేలకు పెంపు
- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు
- మేనిఫెస్టోలో ప్రకటించిన సీఎం జగన్
- జిల్లాలో ఇప్పటికే 7.12 లక్షల మందికి రూ.1,069 కోట్ల అందజేత

చదువుకు పేదరికం అడ్డురాకూడదు. ప్రతి తల్లీ తన బిడ్డలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారు. ఏటా ఈ పథకం కింద విద్యార్థుల తల్లులకు రూ.15 వేల చొప్పున సాయం అందిస్తుండగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ మొత్తాన్ని రూ.17 వేలకు పెంచనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చారు.



జగన్ మామకు థ్యాంక్యూ అని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు (ఫైల్)

అమ్మఒడి సాయం ఇలా..

సంవత్సరం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
2019–29	1,78,919	268.37
2020–21	1,76,740	265.11
2021–22	1,84,239	276.35
2022–23	1,72,956	259.43
మొత్తం	7,12,854	1,069.26

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. విద్యారంగంలో అమ్మఒడి, విద్యాకానుక, వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద, మనబడి–నేడు నేడు వంటి పథకాలతో చదువుల విప్లవం తీసుకువచ్చారు. పేద విద్యార్థుల చదువులకు మరింత ఊతమిచ్చేలా అమ్మఒడి సాయాన్ని రూ.15 వేల నుంచి రూ.17 వేలకు పెంచుతూ వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో పొందుపర్చారు. ఈ పథకం కింద తల్లుల ఖాతాలకు నేరుగా రూ.15 వేలు, పాఠశాలల అభివృద్ధికి రూ.2 వేల చొప్పున అందించనున్నారు.

ఏటా పెరుగుతున్న లబ్ధిదారులు

సీఎం జగన్ అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాలతో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటా క్రమేపీ పెరుగుతోంది. 2019 నుంచి ఏటా కనీసం 10 శాతం పెరుగుదల కనిపిస్తోంది. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు సైతం అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నా చాలా మంది తమ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఐదేళ్లకు రూ.85 వేలు

2024–25 విద్యా సంవత్సరం నుంచి అమ్మఒడి కింద తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున అందిస్తామని సీఎం జగన్ ప్రకటించారు. ఇప్పటివరకు తల్లుల ఖాతాలకు రూ. 13 వేలు, పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంఎఫ్, టీఎంఎఫ్ రూపంలో రూ.2 వేల చొప్పున జమ చేస్తున్నారు. ఇకపై ఈ మొత్తాన్ని మరో రూ.2 వేలు పెంచారు. దీంతో నేరుగా తల్లుల ఖాతాలకు ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్ల రూ.85 వేలు అందిస్తామని ప్రకటించారు.

విద్యకు మరింత ప్రాధాన్యం

- విద్యారంగానికి మరింత ప్రాధాన్యమిచ్చేలా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలో హామీలు ఇచ్చారు.
- వచ్చే ఐదేళ్లలో అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాదీవెన పథకాల కొనసాగింపు.
- నాడు–నేడు పథకం కొనసాగింపుతో పాటు ప్రభుత్వ హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, డిగ్రీ కళాశాలలు, జూనియర్ కళాశాలల్లో కూడా నాడు–నేడు అమలు.
- 2025 నుంచి ఒకటో తరగతికి ఐబీ విద్యావిధానంలో ఏటా ఒక తరగతి పెంచుతూ 2035 నాటికి 10వ తరగతి విద్యార్థులకు ఐబీ, రాష్ట్ర బోర్డుల జాయింట్ సర్టిఫికేషన్.
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు అందజేసే పథకం కొనసాగింపు.
- 18 యూనివర్సిటీల్లో కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్న 3,295 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు.
- డిజిటల్ ఎడ్యుకేషన్‌తో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి.

ఏటా ఆర్థిక సాయం



మా పిల్లలను చదివించుకోవడానికి జగనన్న అమ్మఒడి సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది. గతంలో ఏ ప్రభుత్వమూ మాలాంటి పేదల గురించి ఆలోచించలేదు. జగనన్న మా కష్టాలను తీర్చడానికే ఈ పథకాన్ని తీసుకువచ్చారు. మాట తప్పకుండా ఏటా ఆర్థిక సాయం అందించడంతో పిల్లలను చదివించుకోగలుగుతున్నాం.

– చల్లా నాగమణి, లబ్ధిదారురాలు

సంక్షేమానికి గీటురాయి



సంక్షేమమంటే జగన్.. జగన్ అంటే సంక్షేమం. సంక్షేమానికి గీటు రాయి జగన్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. పేదలపై ఆయనకున్న చిత్తశుద్ధికి అమ్మఒడి సాయం పెంపు నిదర్శనం. అమ్మఒడి సాయం రూ.17 వేలకు పెంచడంతో పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇది పేదల విద్యకు మరింత ఊతమిస్తుంది.

– కుమారుడితో గంగుల రత్నకుమారి

ముందుచూపుతో..



భవిష్యత్‌లో పెరిగే ధరలను బేరీజు వేసుకుని జగనన్న అమ్మఒడి ఆర్థిక సాయాన్ని పెంచారనుకుంటున్నాం. ఆయన ముందు చూపునకు సలాం. బడి మాన్పించకుండా పిల్లలను చదివించుకోవాలనుకునే తల్లులకు ఆసరాగా అమ్మఒడి ఉంది. మరో 20 ఏళ్ల జగన్ సీఎంగా ఉంటే రాష్ట్రంలో పేదలంతా అభివృద్ధి చెందుతారు.

– తన బిడ్డతో మరీదు అన్నపూర్ణ

జగనన్నకే సాధ్యం



అమ్మఒడి వంటి పథకాన్ని ప్రవేశపెట్టడం ఒక్క జగనన్నకే సాధ్యం. వచ్చే ఐదేళ్లలో ఆర్థిక సాయాన్ని మరో రూ.2 వేలకు పెంచడం సాహసోపేత నిర్ణయం. పేద కుటుంబాలకు ఇదో గొప్పవరంగా భావిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుంది.

– వెరిచర్ల హేమబిందు

చంద్రబాబువి మోసపూరిత వాగ్దానాలు

రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు



ప్రచారంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బాబూరావు. చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల మోసపూరిత వాగ్దానాలను ప్రజలు నమ్మవద్దని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని కృష్ణాపురంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ దేశానికే ఆదర్శమైన సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. కుట్రలు, కుతంత్రాలు చేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు బుద్ధి చెప్పేలా ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జగన్ సీఎం అయితేనే మరలా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. ఈ దిశగా ప్రతిఒక్కరూ ఆలోచన చేసి ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పోలవరం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సతీమణి రాజ్యలక్ష్మి కూడా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతారని చెప్పారు. సీనియర్ నాయకులు ఊదరగొండి చంద్రమౌళి ఉన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

5,690 మంది ఉద్యోగుల వినియోగం

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగుల్లో తొలిరోజు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 5,690 మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఉంగుటూరులో 735 మంది, కైకలూరులో 468 మంది, నూజివీడులో 471 మంది, చింతలపూడిలో 1,001 మంది, పోలవరంలో 1,195 మంది, ఏలూరులో 972 మంది, దెందులూరులో 848 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే జిల్లాలో 85 ఏళ్లు పైబడిన, దివ్యాంగులు 863 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకోగా నియోజకవర్గాల వారీగా పోలవరంలో 90 మంది, ఉంగుటూరులో 213 మంది, ఏలూరులో 100 మంది, చింతలపూడిలో 118 మంది, దెందులూరులో 92 మంది, కైకలూరులో 151 మంది, నూజివీడులో 99 మంది ఉన్నారు.

పటిష్ట ఏర్పాట్లు : కలెక్టర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఏలూరు కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. జిల్లాలో అత్యధికంగా ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫెసిలిటేషన్ కేంద్రంలో 4 వేల మంది పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకోనున్నారన్నారు. ఈ మేరకు ఇక్కడ పక్కా ఏర్పాట్లు చేశామన్నారు. ఆదివారం కూడా ఆయా కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చన్నారు. ఏలూరు, దెందులూరు, నూజివీడులో ఓటింగ్ తీరును తాను పరిశీలించానన్నారు. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకట కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

సీఆర్ఆర్ మహిళా కళాశాలలో..

ఏలూరు సీఆర్ఆర్ మహిళా కళాశాలలో ఏర్పాటుచేసిన దెందులూరు నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ జేసీ లావణ్యవేణితో కలిసి సందర్శించారు. కేంద్రాల్లో టెంట్లు, తాగునీరు, హెల్ప్‌డెస్క్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వంటి ఏర్పాట్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఉద్యోగులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు.



ఏలూరులోని కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో బారులు తీరిన ఉద్యోగులు



సీఆర్ఆర్ మహిళా కళాశాలలో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ లావణ్యవేణి



ఏలూరులో పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకుంటున్న ఉద్యోగిని

స్వేచ్ఛగా ఓటేయండి

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



ఏలూరు టౌన్: ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలనీ, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కును వినియోగించుకోవటం ద్వారా ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని ఫెసిలిటేషన్ కేంద్రంలో ఆయన పోస్టల్ బ్యాలెట్ ఓటును వినియోగించుకున్నారు.

కొల్లేరుకు కొత్త రూపు జగన్‌తోనే సాధ్యం

ఎమ్మెల్సీ జయమంగళ

కైకలూరు: కొల్లేరు గ్రామాల సర్వతోముఖాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. శనివారం నత్తగుళ్లపాడు, చటాకాయి కొల్లేరు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. తనకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారని, తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు ఎమ్మెల్సీ ఇస్తానని చెప్పి మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్ ప్రజలకు అందుబాటులో ఉండరని, ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రజల మధ్యనే నిత్యం తిరుగుతూ సమస్యలను పరిష్కరిస్తారని అన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ముంగర నరసింహారావు, జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, సయ్యపురాజు గుర్రాజు, దాసరి అబ్రహం లింకన్, చావలి రజనీకాంత్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



చటాకాయి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

18 నుంచి చిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలను ఈనెల 25 వరకు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు శనివారం తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం, సాయంత్రం గ్రామోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ ముఖ మండపంలో స్వామివారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఉత్సవాల నేపథ్యంలో ఈనెల 18 నుంచి 25 వరకు ఆలయంలో నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను రద్దు చేస్తామన్నారు.

ఉత్సవాలు ఇలా..

- 18న ఉదయం శ్రీవారు, అమ్మవార్లకు పెండ్లి ముస్తాబుతో ఉత్సవాలు ప్రారంభం. రాత్రి 7 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం.
- 19న రాత్రి 7 గంటల నుంచి అంకురార్పణ, ఋత్విగ్వరణ, ధ్వజారోహణ. రాత్రి 9 గంటల నుంచి హంస వాహనంపై గ్రామోత్సవం.
- 20న ఉదయం 7 గంటల నుంచి సూర్యప్రభ వాహనంపై, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం.
- 21న ఉదయం 7 గంటల నుంచి హనుమద్వాహనంపై గ్రామోత్సవం. రాత్రి 7 గంటల నుంచి ఎదుర్కోలు ఉత్సవం. రాత్రి 8.30 గంటల నుంచి వెండి శేషవాహనంపై గ్రామోత్సవం.
- 22న రాత్రి 8 గంటల నుంచి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం. అనంతరం వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం. ఉదయం 7 గంటల నుంచి సింహ వాహనంపై గ్రామోత్సవం.
- 23న రాత్రి 7.30 గంటల నుంచి రథోత్సవం.
- 24న ఉదయం చక్రవారి–అవభృథోత్సవం, మధ్యాహ్నం వేద సభ, రాత్రి 7 గంటల నుంచి పూర్ణాహుతి, మౌనబలి, ధ్వజావరోహణ, రాత్రి 8 గంటలకు అశ్వవాహనంపై గ్రామోత్సవం.
- 25న ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవం. రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగం – పవళింపు సేవతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

క్లుప్తంగా

పింఛను కోసం వెళ్లి అనంతలోకాలకు..


దీనకుమారి (ఫైల్)

పెదపాడు: పింఛను సొమ్ము కోసం బ్యాంకుకు వెళ్లిన ఓ వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పెదపాడు గ్రామ శివారు పాతపెదపాడు గ్రామానికి చెందిన దోమతోటి దీనకుమారి (72) పింఛను సొమ్ము కోసం పాతపెదపాడు నుంచి పెదపాడులోని ఇండియన్ బ్యాంకుకు వెళ్లింది. ఇంటి నుంచి మూడు కిలో మీటర్ల దూరం నడిచి బ్యాంకుకు వెళ్లిన ఆమె.. బ్యాంకుకు వెళ్లిన కొద్దిసేపటికి అక్కడే కుప్పకూలింది. దీంతో సమాచారం అందుకున్న బంధువులు వెంటనే ఆమెను ఏలూరులోని ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడకు తరలిస్తుండగా మార్గంలోనే ప్రాణాలు కోల్పోయింది. ఈ వివరాలను ఆమె కుమారుడు థామస్ శనివారం వెల్లడించారు. వలంటీర్ల సేవలు అందుబాటులో ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదనే అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం



భీమడోలు : భీమడోలు రైల్వేస్టేషన్ సమీపంలోని పాతూరు వద్ద శుక్రవారం రాత్రి వైజాగ్ నుంచి తిరుమలకు వెళుతున్న రైలు నుంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడి దొర్లుకుంటూ పక్క ట్రాక్‌పై పడ్డాడు. అదే సమయంలో వచ్చిన మరో రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్సై డి.నరసింహరావు ఘటన స్థలానికి వచ్చి పరిశీలించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చని, కోలముఖం, నల్లని జుట్టు, గడ్డం, నలుపు రంగు అడ్డచారలు గల కాషాయం రంగు పొట్టి చేతుల టీషర్ట్, నీలం రంగు జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తి వివరాలు తెలిసిన వారు 95020 97672 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

అవ్వాతాతలకు తప్పని అవస్థలు

- నాలుగో తేదీ వచ్చినా చేతికి అందని పింఛను సొమ్ము
- బ్యాంకుల చుట్టూ తిరుగుతూ అష్టకష్టాలు పడుతున్న పండుటాకులు
- ఇది చంద్రబాబు పుణ్యమేనంటూ శాపనార్థాలు


జంగారెడ్డిగూడెం యూనియన్ బ్యాంకులో పింఛన్ కోసం బారులు తీరిన పింఛన్ లబ్ధిదారులు

జంగారెడ్డిగూడెం: నాలుగో తేదీ వచ్చినా ఇంకా పింఛను సొమ్ములు చేతికి అందక అవ్వాతాతలు ఇబ్బందులు పడుతున్నారు. పింఛన్ సొమ్ము బ్యాంకులో జమ అయినా అవి తీసుకునేందుకు ఖాతాలు యాక్టివ్‌లో లేకపోవడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే అందే పింఛన్ చంద్రబాబు పుణ్యమా అంటూ అందకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో మళ్లీ పింఛన్ కష్టాలు మొదలయ్యాయని బాధపడుతున్నారు. ఐదేళ్ల తరువాత మళ్లీ ఇటువంటి పరిస్థితి రావడానికి కారణం చంద్రబాబునాయుడే కారణమని దుయ్యబడుతున్నారు. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్నా ఆధార్ లింక్ కాలేదని, ఖాతా మనుగడలో లేదని ఇలా వివిధ కారణాలతో పింఛన్ అందడం లేదు. ఎన్నికల పుణ్యమా అంటూ వలంటీర్లపై లేనిపోని ఆరోపణలు చేసి వారి సేవలను చంద్రబాబు దూరం చేయడంతోనే తాము ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నట్లు లబ్ధిదారులు వాపోయారు. గత నెల సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే, ఈ సారి బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం కూడా పట్టణంలో ఏ బ్యాంకు చూసినా పింఛన్ లబ్ధిదారులతో కిక్కిరిసిపోయాయి.

వారం తరువాత రమ్మన్నారు



పింఛన్ సొమ్ము తీసుకోవడానికి ఉదయమే బ్యాంకుకు వచ్చా. చాలా సేపు నిరీక్షించిన తరువాత కౌంటర్ వద్దకు వెళ్లగా, వారం తరువాత రమ్మన్నారు. అదేంటి అని అడిగితే మీ అకౌంట్ ఫోర్స్‌లో లేదు.. పునరుద్ధరించాలంటే సమయం పడుతుందని బ్యాంకు అధికారులు చెప్పారు. ప్రతి నెలా ఏ ఇబ్బంది లేకుండా 1వ తేదీనే పింఛన్ అందేది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఇప్పుడు నాలుగో తేదీ వచ్చినా పింఛను అందలేదు. ఇంకా వారం రోజులు పింఛన్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– బి.వెంకటరావు, పేరంపేట, జంగారెడ్డిగూడెం

17 వేల మందికి పోస్టల్ బ్యాలెట్


నూజివీడులోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వే ప్రసన్న వెంకటేష్.

నూజివీడు: జిల్లాలో 17 వేల మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ చెప్పారు. నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 వేల మందికి పైగా ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు, 2 వేల మంది పోలీసు సిబ్బంది, జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాల్లో ఓటు హక్కు కలిగిన సిబ్బంది 3 వేల మందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు. వీరికి ఈ నెల 4, 5 తేదీలలో నియోజకవర్గాల ప్రధాన కేంద్రాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ చెప్పారు. ఇతర ఏ జిల్లాలో తమ ఓటు ఉన్నప్పటికీ, ఈ జిల్లాలో వారు పనిచేసే నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌లో తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటారన్నారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు 'హోమ్ ఓటింగ్' విధానం ద్వారా 926 మంది కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులు, వయోవృద్ధుల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి ఓటు హక్కు కల్పిస్తున్నామని వివరించారు. కలెక్టర్ వెంట నూజివీడు ఆర్డీఓ వై.భవాని శంకరి, రెవెన్యూ, పోలీసు, ఇతర అధికారులు ఉన్నారు.

'వరి'వడిగా పట్టుబడులు

- జిల్లాలో ముమ్మరంగా మాసూళ్లు
- 263 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 2.35 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- రైతుల ఖాతాల్లో రూ.289.67 కోట్ల జమ


భీమవరం ప్రాంతంలో పట్టుబడులు చేస్తున్న దృశ్యం

భీమవరం: ప్రభుత్వ ప్రోత్సాహం, అధికారుల ప్రత్యేక శ్రద్ధతో ఆశాజనకంగా ఉన్న దాళ్వా పంట పట్టుబడులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ప్రభుత్వం వేగంగా ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు గడువులోపు రైతుల ఖాతాల్లోకి సొమ్ములు జమచేస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు రైతుల నుంచి సుమారు రూ.513 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా రూ. 289 కోట్లు చెల్లించారు. జిల్లాలో ప్రస్తుత దాళ్వా సీజన్‌లో సుమారు 2.20 లక్షల ఎకరాల్లో వరి పండించగా దాదాపు 9.45 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. జిల్లాలోని 263 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 7.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత సార్వా సీజన్ పంట మాసూళ్ల సమయంలో ఆకాల వర్షాల కారణంగా రైతులు ఇబ్బంది పడ్డారు. దీంతో మాసూళ్ల ఆలస్యమయ్యాయి. ఈ ప్రభావం దాళ్వా నాట్లపై పడటంతో సాగు నీటి ఎద్దడి ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేయగా వ్యవసాయ, నీటిపారుదల శాఖాధికారులు సమన్వయంతో పనిచేసి శివారు భూములకు సైతం పూర్తి స్థాయిలో నీరందించారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీటిని అందించడం విశేషం. సంవృద్ధిగా నీటి సరఫరా, వాతావరణం అనుకూలించడంతో పైరు ఏపుగా పెరిగి పంట ఆశాజనం ఉంది. సగటున ఎకరాకు సుమారు 55 బస్తాల వరకు దిగుబడి వస్తోంది.

నూక సమస్య ఇబ్బంది లేకుండా.. గత దాళ్వా సీజన్‌లో అధిక ఉష్ణోగ్రత ప్రభావం ధాన్యంపై పడింది. ఎక్కువ ఎండటం వల్ల బియ్యంలో నూక శాతం పెరిగి కొన్నిచోట్ల ధాన్యాన్ని మిల్లర్లు దింపుకోకుండా రైతులను ఇబ్బంది పెట్టారు. గత అనుభవం దృష్ట్యా అధికారులు ముందుగానే రైతులకు అవగాహన కల్పించారు. దీంతో ధాన్యం ఎక్కువగా ఎండబెట్టకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవడంతో నూక సమస్య తలెత్తడం లేదు.

రూ.289.96 కోట్ల చెల్లింపు : ప్రస్తుత దాళ్వా సీజన్‌లో ఇప్పటివరకు 26,826 మంది రైతుల నుంచి సుమారు 2,35,110 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. సుమారు రూ.513.67 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటివరకు సుమారు 15 వేల మంది రైతులకు దాదాపు రూ.289.96 కోట్లు చెల్లించారు. రైతులు కళ్లాల వద్దనే ధాన్యం విక్రయిస్తుండగా పట్టుబడి పట్టిన వారం లోగానే ధాన్యం సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారు. అధిక దిగుబడులతో పాటు వెంటనే సొమ్ములు చేతికి అందడంతో రైతులంతా ఆనందంగా ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసలు


సీతంపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన శ్రేణులతో జెట్టి గురునాథరావు

కొయ్యలగూడెం: కూటమి పార్టీల నీతిమాలిన చర్యలను చూస్తూ నైతికత లేని వారి సంబంధాలను ఖండిస్తూ శ్రేణులు పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్, పోలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. శనివారం రాత్రి సీతంపేట గ్రామంలో సర్పంచ్ తోటకూర పద్మావతి, ఏఎంసీ డైరెక్టర్ తోట జయబాబుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ సమావేశం నిర్వహించారు సమావేశంలో జెట్టి గురునాథరావు సమక్షంలో టీడీపీ, జనసేనలకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి గురునాథరావు పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. కొప్పుల వెంకటేశ్వరరావు, మధ్యాహ్నపు యేసు, తోటకూర శ్రీను, యడ్లపల్లి కృష్ణ, కోలా గంగబాబు, పెనుమర్తి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చనుబండ టీడీపీ కార్యకర్తల చేరిక

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు గద్దల గోపి, నారాయణ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏపీ కో–ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, మోరంపూడి నాగేశ్వరరావు, ఎంపీటీసీ దార్ల సోనీ ఆనంద్ పాల్గొన్నారు.

కూటమి పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారు


ఆచంటలో మాట్లాడుతున్న గెరా హనోక్

పెనుగొండ: దళితులు, క్రైస్తవులు, మైనారిటీలను కించపరిచి, వారి మనోభావాలు దెబ్బతీసిన కూటమి పార్టీలకు సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) జాతీయ అధ్యక్షులు, వైఎస్సార్ సీపీ ఎలక్షన్ కో–ఆర్డినేటర్ గెరా హనోక్ హెచ్చరించారు. ఆచంటలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మతమార్పిడిలు చేసుకోవచ్చు, పౌరులు నచ్చిన మతంలోకి వెళ్లవచ్చని రాజ్యాంగంలోని 25, 28వ అధికరణాలు పేర్కొంటుండగా, దీనికి భిన్నంగా కూటమి నేతలు క్రైస్తవుల మనోభావాలను కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ఏఐసీసీ రాష్ట్ర ట్రెజరర్ బి.ఆశీర్వాదం, ఏఐసీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కే డేవిడ్‌రాజ్, జిల్లా జనరల్ సెక్రెటరీ ఎస్.క్రీస్తు దాసు, స్టేట్ అడ్వైజర్ బ్రదర్ జె.రాబిన్ పాల్గొన్నారు.

శ్రీవారి తొలి హారతికి దర్శనం నిలిపివేత

అధికారులపై స్థానిక భక్తుల ఆగ్రహం


ఈఓతో మాట్లాడుతున్న స్థానిక భక్తులు

ద్వారకాతిరుమల: శ్రీవారి తొలి హారతిని అందుకునేందుకు ఆలయంలోకి అనుమతించలేదంటూ స్థానిక భక్తులు శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావును కలిసి సమస్యను వివరించారు. వివరాల్లోకి వెళితే.. ప్రతి రోజూ తెల్లవారుజామున సుప్రభాత సేవ అనంతరం ఉదయం 6 గంటల సమయంలో స్వామి, అమ్మవార్లకు తొలి హారతి ఇస్తారు. ప్రతి శనివారం ఈ హారతిని అందుకునేందుకు స్థానిక భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి వెళతారు. ఇది పూర్వం నుంచి ఆనవాయితీగా వస్తోంది. శనివారం ఉదయం హారతి దర్శనం కోసం వెళ్లగా స్థానిక భక్తులను దేవస్థానం సిబ్బంది అనుమతించలేదు. దీంతో ఈఓ త్రినాథరావును కలిసి జరిగిన విషయాన్ని తెలిపారు. ఆలయ పడమర మార్గాన్ని, శివాలయానికి వెళ్లే మెట్లు మార్గాన్ని, అర్చకుల వీధికి వెళ్లే మార్గాన్ని మూసివేసి, భక్తుల రాకపోకలను నిషేధించారని, ఇదేంటని ప్రశ్నిస్తే ఆలయ భద్రతలో భాగంగా చేశారని సిబ్బంది చెబుతున్నారని ఈఓకు వివరించారు. దీనిపై ఆలయ ఈఓ త్రినాథరావు మాట్లాడుతూ స్వామివారి తొలి హారతి విషయంలో స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. అలాగే ఆలయ భద్రతలో భాగంగా తీసుకున్న నిర్ణయాలపై ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

తనిఖీల్లో నగదు సీజ్

ముదినేపల్లి రూరల్: ఎన్నికల సందర్భంగా పెదపాలపర్రు చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.99,970 నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు ఇన్‌చార్జి కె.రమణబాబు చెప్పారు. మండవల్లి మండలం కానుకొల్లుకు చెందిన పులకుర్తి సత్యనారాయణ ప్రసాద్ మినుముల వ్యాపారం చేస్తూ ఉంటాడు. ఇందుకు సంబంధించి లావాదేవీలు ముగించుకుని శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా, చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో నగదు ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు రమణబాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తాపీ కూలీ మృతి

కైకలూరు: కూలి పనులు ముగించుకుని సైకిల్‌పై వస్తుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. కైకలూరు టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం వైఎస్సార్ నగర్‌కు చెందిన ఆగోళ్ల శ్రీనివాసరావు (60) తాపీ కూలీగా పనిచేస్తున్నాడు. వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్‌లో పని ముగించుకుని శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై వెళుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ పోలీసులు తెలిపారు.

కొయ్యలగూడెంలో వైనాట్ షోరూం ప్రారంభం


కొయ్యలగూడెం షోరూంలో లక్కీడ్రా విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: వినియోగదారుల విశ్వాసానికి శాశ్వత చిరునామాగా వైనాట్ దుకాణ సముదాయాలు నిలుస్తున్నాయని సంస్థల అధినేత జుజ్జవరపు రాయుడు అన్నారు. కొవ్వూరు రోడ్‌లోని విశ్వేశ్వరరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైనాట్ షాపింగ్ మాల్ 33వ బ్రాంచ్‌ను శనివారం ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ విజయవాడ బ్రాంచ్ మేనేజర్ పి.కిషోర్‌బాబు ప్రారంభించారు. లక్కీడ్రాలో గెలుపొందిన జి.రత్నకుమారికి రూ.12 వేల విలువైన వాషింగ్ మెషీన్‌ను బహుమతిగా అందజేశారు.

ఊరూరా ప్రచార హోరు

ప్రచార పర్వం

ఊరూరా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతున్నారు. **గత పాలనకు, జగన్ పాలనకు** తేడా గమనించాలని, ఫ్యాన్ గుర్తుకు **ఓట్లు వేసి మరోసారి ప్రజాప్రభుత్వాన్ని** ఆశీర్వదించాలని కోరుతున్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న జగనన్నకే పట్టం కట్టాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నెరవేర్చని వాగ్దానాలతో, మాయమాటలతో మోసగించే కూటమి అభ్యర్థులను తరిమికొట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



బుట్టాయగూడెం : ఎన్నికల ప్రచారంలో ఫ్రైడ్‌రైస్ తయారు చేస్తున్న పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థిని తెల్లం రాజ్యలక్ష్మి



ఏలూరు టౌన్: ఏలూరు 12వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని



గణపవరం : చిలకంపాడులో మహిళలతో కలిసి ప్రచారం చేస్తున్న ఉంగుటూరు ఎమ్మెల్యే అభ్యర్థి పుప్పాల వాసుబాబు



కామవరపుకోట : జలపవారిగూడెంలో ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు



పెదవేగి : వీవీ ప్యాడ్‌లోని ఫ్యాన్ గుర్తును చూపుతున్న దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరి



చాట్రాయి : సోమవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ద్వారకాతిరుమల : సత్తెన్నగూడెంలో ప్రచారంలో ప్రసంగిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థిని తానేటి వనిత

వైఎస్సార్ సీపీకి మెకానిక్‌ల మద్దతు



మెకానిక్‌ల అసోసియేషన్ నేతలతో ఎమ్మెల్యే నాని

ఏలూరు టౌన్: నగరంలోని మెకానిక్‌లకు ఏపీఐఐసీ ద్వారా స్థలాలు కేటాయించి, షాపుల నిర్మాణానికి రుణ సదుపాయం కల్పిస్తామని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. శ్రీరామ్ నగర్ క్యాంపు కార్యాలయంలో ది ఏలూరు టౌన్ ఆటో నగర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అరుణతార నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కర్రి ఈశ్వరరావు, కార్యదర్శి అడపా సత్యనారాయణ తదితరులు ఆళ్లనానిని కలిసి మద్దతును తెలిపారు. నాయకులు మద్రాపు సత్యనారాయణ, సీహెచ్ పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

సాధ్యం కాని హామీలతో మభ్యపెట్టడం తగదు

- రాజకీయ పార్టీలకు సూచించిన ఓపెన్ మైండ్స్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రాజశేఖరరెడ్డి
- మార్టేరులో 2024 ఎన్నికలు – ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అంశంపై సదస్సు



సెమినార్‌లో మేనిఫెస్టోను చూపుతున్న ఎస్.రాజశేఖరరెడ్డి, మేడపాటి వెంకట్, ఎల్లాప్రగడ కార్తీక్ తదితర ప్రముఖులు

పెనుమంట్ర, పోడూరు: భావితరాలకు మంచి భవిష్యత్తు అందించే నాయకులనే ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని ఓపెన్ మైండ్స్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.రాజశేఖరరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మార్టేరు రెడ్డి కళ్యాణమండపంలో శనివారం ఓపెన్ మైండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2024 ఎన్నికలు – ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కోఆర్డినేటర్ ఎం.విజయరెడ్డి అధ్యక్షత వహించారు. సెమినార్‌లో ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఎస్.రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా యువత తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కేవలం అధికారమే లక్ష్యంగా అబద్ధాలతో, సాధ్యంకాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో విజయం సాధించాలని కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అటువంటి మోసపూరిత హామీలకు దూరంగా ఉండి సాధ్యమయ్యే హామీలనే మేనిఫెస్టోలో పెట్టడం అభినందనీయమని అన్నారు. చెప్పింది చెయ్యడం .. చేయగలిగిందే చెప్పడం సీఎం వైఎస్ జగన్ నైజమన్నారు. సెమినార్‌లో రైతు నాయకుడు సత్తి వెంకటరెడ్డి మాట్లాడుతూ కొన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై తీవ్రస్థాయిలో బురదజల్లుతున్నాయని, దీంతో రైతులంతా గందరగోళానికి, అయోమయానికి గురవుతున్నారన్నారు. వాస్తవానికి ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో రైతులకు, ప్రజలకు ప్రయోజనమే తప్ప ఎటువంటి ముప్పు లేదన్నారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై వాస్తవాలను మేధావులు, నిపుణులు రైతులకు, ప్రజలకు వివరించాల్సిన అవసరం చాలా ఉందన్నారు. సోషల్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు సత్తి సుబ్బారెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీ పాలనను రాష్ట్ర ప్రజలు మరోసారి నిలుపుకోగలిగితే రాబోవు పదేళ్లలో విదేశీయులు సైతం ఉద్యోగాలు చేసేందుకు, ఉపాధికోసం మన రాష్ట్రానికి వలస వచ్చే స్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. సెమినార్‌లో వాసవి కళాశాల విద్యార్థిని వైష్ణవి మాట్లాడుతూ పేదరికంతో అనేకమంది తమ పిల్లలను చదివించేందుకు వెనుకాడేవారనీ, కానీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అమ్మఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎంతో శ్రద్ధగా చదివిస్తున్నారన్నారు. సెమినార్‌లో నవరత్నాలు అమలు విభాగం ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ ఎ.నారాయణమూర్తి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, ఏపీ ఎన్ఆర్‌టీ ఎఫైర్స్ అండ్ సర్వీస్ ప్రభుత్వ సలహాదారు మేడపాటి వెంకట్, ఏపీఎస్ఆర్‌టీసీ రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.కోటేశ్వరరావు, ఎన్ఆర్ఐ ఎల్లాప్రగడ కార్తీక్, ఐటీ విభాగం కార్యదర్శి కొవ్వూరి నాని తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యోగా అసోషియేషన్ అధ్యక్షుడు చెరుకువాడ నరేష్‌వర్మ, ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి(వాసు), జెడ్పీటీసీ కర్రి గౌరీ సుభాషిణి, సర్పంచ్ మట్టా కుమారి రాము, ఎంపీటీసీలు కర్రి అనురాధ, గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, పెనుగొండ లక్ష్మి, సంఘ సేవకుడు వర్మ, కళాశాల విద్యార్థులు రైతులు పాల్గొన్నారు.

రోగులకు తీరిన చింత

వైద్య రంగం అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ ప్రశంసలు సైతం అందుకునే స్థాయికి ఎదిగామంటే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధే నిదర్శనం. చంద్రబాబు హయాంలో ప్రాథమిక ఆరోగ్యం విషయంలో ఎక్కడో అట్టడుగు స్థాయిలో ఉన్న రాష్ట్రాన్ని సీఎం జగన్ నెంబర్ ఒన్ స్థాయికి తీసుకువచ్చారు. ప్రతి జిల్లాలో ఒక మెడికల్ కళాశాల, ప్రతి నియోజకవర్గంలో ఒక నూరు పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అందుకు అనుగుణంగా నిధులు మంజూరు చేసి వైద్య రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

- చింతలపూడికి నూరు పడకల ఆసుపత్రి మంజూరు
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్
- రూ.25 కోట్లతో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం
- పూర్తి కావచ్చిన భవనాలు
- ఏలూరుతో పాటు కృష్ణా, ఖమ్మం జిల్లాల ప్రజలకు అందుబాటులోకి వైద్య సేవలు



చింతలపూడిలో రూ.25 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి భవనాలు

చింతలపూడి: బ్రిటీష్ కాలం నుంచి వెనుకబాటుతనానికి గురైన చింతలపూడి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన మరుక్షణం చింతలపూడికి 100 పడకల ఆసుపత్రిని మంజూరు చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చింతలపూడిలో ఇచ్చిన మాటను ఆయన నిలబెట్టుకున్నారు. ప్రస్తుతం చింతలపూడి పట్టణంలో 30 పడకల ఆసుపత్రి అందుబాటులో ఉంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునీకరించడంతో పాటు డాక్టర్ల కొరత, మందుల కొరతను తీర్చారు. చింతలపూడి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయి. 5 బ్లాకులుగా అత్యంత భారీగా భవనాలను నిర్మిస్తున్నారు. 100 పడకలతో పాటు, అత్యాధునిక వైద్య పరికరాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ భవనాలు పూర్తయితే అన్ని రకాల వైద్య సదుపాయాలతో పాటు నిపుణులైన వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, సపోర్టింగ్ స్టాఫ్, వైద్య పరీక్షల కోసం ఆధునిక ల్యాబ్ అందుబాటులోకి రానున్నాయి. రూ.25 కోట్ల వ్యయంతో 95,000 చదరపు అడుగుల వైశాల్యంలో ఆసుపత్రి భవనాలను నిర్మిస్తున్నారు.



జంగారెడ్డిగూడెంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి

నూరు పడకల ఆస్పత్రి అవసరం లేదన్న టీడీపీ

2011లో నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలో వంద పడకల ఆసుపత్రిని ఆనాటి ప్రభుత్వం మంజూరు చేసింది. గత టీడీపీ హయాంలో చింతలపూడికి నూరు పడకల ఆసుపత్రి అవసరం లేదని, ఉన్న 30 పడకల ఆసుపత్రినే ఆధునీకరించడానికి రూ.80 లక్షలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. ఈ ఆసుపత్రిని ఆధునీకరించినా ఉపయోగం ఉండదని, 100 పడకలకు విస్తరిస్తేనే డాక్టర్ల కొరతతో పాటు మందులు, సిబ్బంది కొరత కూడా తీరుతుందని నియోజకవర్గ ప్రజలు నెత్తీ, నోరూ బాదుకున్నా గత తెలుగుదేశం పాలకులు పట్టించుకోలేదు. లింగపాలెం, కామవరపుకోట, టి.నర్సాపురం, చింతలపూడి మండలాల నుంచే కాక కృష్ణా జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి కూడా నిత్యం 300 నుంచి 400 మంది రోగులు ఈ ఆసుపత్రికి వైద్యం నిమిత్తం వస్తుంటారు. ప్రతి రోజు ఎమర్జెన్సీ కేసులు, పోస్టుమార్టం కేసులు వస్తుంటాయి. నూరు పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే వైద్య పరంగా ఈ ప్రాంతం అభివృద్ధి సాధిస్తుందనడంలో సందేహం లేదు.

నియోజకవర్గంలో రెండు 100 పడకల ఆసుపత్రులు

నియోజకవర్గంలో రెండు వంద పడకల ఆసుపత్రులు ఉండటం విశేషం. ఈ రెండు ఆసుపత్రులను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేయడం ఇక్కడ మరో విశేషం. వైఎస్సార్ హయాంలో జంగారెడ్డిగూడెంలో వంద పడకల ఆస్పత్రి మంజూరు చేసి ఈ ప్రాంత ప్రజల కలను నెరవేర్చారు. అప్పటివరకు ఉన్న ఎనిమిది పడకల ఆస్పత్రిని 30 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరినా ఫలించలేదు. 2007 జూన్ 7వ తేదీన వైఎస్సార్ జంగారెడ్డిగూడెం వచ్చిన సందర్భంగా వంద పడకల ఆస్పత్రి అవసరాన్ని గుర్తించిన వైఎస్ రాజశేఖరరెడ్డి వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి అదే రోజు శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.7.54 కోట్లతో భవనాలను నిర్మించారు.

వైద్య రంగం అభివృద్ధికి జగన్ కృషి



వైద్యరంగం అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయం. వైద్యరంగంలో వెనుకబడిన చింతలపూడికి 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు రుణపడి ఉంటారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తికావచ్చింది.

– గోలి చంద్రశేఖర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ నిర్వాహకులు

కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడం అద్భుతం



నియోజకవర్గ కేంద్రంలో నూరు పడకల ఆసుపత్రి నిర్మాణంతో పేద ప్రజలకు మంచి జరుగుతుంది. నిరుపేదలకు జబ్బు చేస్తే పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అన్ని సౌకర్యాలతో అధునాతన ఆసుపత్రి నిర్మాణం చేపట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– కలకొండ రామారావు, విద్యావేత్త, ఎంపీటీసీ, సీతానగరం